అధ్వానంగా రోడ్లు

● గుంతల్లో చేరుతున్న మురుగునీరు ● కంపు కొడుతున్న కైసర్‌నగర్ బస్తీ


రోడ్డుపై గుంతల్లో చేరిన మురుగునీరు


అధ్వానంగా ఉన్న రోడ్డు

గాజులరామారం, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): బస్తీలోని రోడ్లపై గుంతలుపడి అధ్వానంగా మారాయి. డ్రైనేజీ మురుగునీరు గుంతల్లో చేరడంతో దుర్వాసన వెలువడుతూ కంపు కొడుతున్నాయి. నడవడానికి కూడా వీలులేకుండా రోడ్లన్నీ అపరిశుభ్రంగా మారాయి. ఇది గాజులరామారం డివిజన్‌లోని కైసర్‌నగర్ బస్తీ దుస్థితి. పదిహేనేళ్ల కిందట బస్తీ ఏర్పడింది. నేటికి బస్తీలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు. రోజురోజుకూ జనాభా పెరుగుతున్న అందుకనుగుణంగా సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదు. సమస్యలను పరిష్కరించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేస్తే అవి చెత్తకుప్పల పాలవుతున్నాయని బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని ఓట్లు వేయించుకుని, గద్దెనెక్కిన తర్వాత ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. 'డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతూ దుర్వాసన వెలువడుతోంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. సాయంత్రం అయితే ఇళ్లలో ఉండలేక పోతున్నాం. డ్రైనేజీ నీటి నుంచి వచ్చే దుర్వాసనతో ఆనారోగ్యం పాలవుతున్నాం. కనీసం రోడ్డు మీద నడవలేని పరిస్థితి ఉంది' అని బస్తీవాలు అంటున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



వర్షం వచ్చిందంటే రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. వర్షపు నీటిలో డ్రైనేజీ నీరు కూడా కలిసి దుర్వాసన వస్తుంది. ఏ రోడ్డులో చూసినా అడుగులోతు గుంతలు ఉన్నాయి. నూతనంగా రోడ్లు వేయాలని అధికారులకు, నాయకులకు ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

\- చందు, స్థానికుడు

క్రీడాపాఠశాలలో ప్రవేశానికి 21 నుంచి ఎంపిక పోటీలు

దుండిగల్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ క్రీడాపాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 21 నుంచి 25 వరకు విద్యార్థులకు మండలస్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని కుత్బుల్లాపూర్ ఎంఈవో వసంతకుమారి తెలిపారు. విద్యార్థులు 1-9-2015 నుంచి 31-8-2016 మధ్య జన్మించి ఉండాలని అన్నారు. ఆధార్‌కార్డు ఒరిజనల్ స్కూల్ బోనాఫైడ్ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, కులం సర్టిఫికేట్, 5 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని హాజరుకావాలన్నారు.

ఈపీటీఆర్ఐలో రిఫ్రెషర్ వర్క్‌షాపు

రాయదుర్గం, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని ఈపీటీఆర్ఐలో ఈఎఫ్ఎస్ అండ్ టీ సిబ్బందికి 'పర్యావరణ పాలన, వాతావరణ మార్పు' అంశాలపై రెండు రోజుల శిక్షణ (రిఫ్రెషర్ వర్క్‌షాపు) గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఈపీటీఆర్ఐ ప్రధాన కార్యదర్శి ఎ.వాణిప్రసాద్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం పలు టెక్నికల్ సెషన్లతోపాటు సాంకేతిక, అడ్మిన్‌స్ట్రేషన్‌లపై శిక్షణ ఇచ్చారు. స్వచ్ఛమైన సురక్షితమైన పర్యావరణం, దేశంలోని వివిధ పర్యావరణ చట్టాలను ఉద్యోగులకు వివరించారు. వాతావరణ మార్పు, శిక్షణ విభాగాల అధిపతి డాక్టర్ రాజేశ్వర్ జొన్నలగడ్డ కార్యక్రమానికి సమన్వయ కర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవ చేయడమే లయన్స్ క్లబ్ లక్ష్యం

చందానగర్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): సేవ చేయడమే లయన్స్‌క్లబ్ లక్ష్యమని లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ కరుణాకర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం 320డీ లయన్స్ డిస్ట్రిక్ట్ పరిధిలోని జోన్ చైర్మన్‌లతో చందానగర్ ఇంజనీరింగ్ ఎన్‌క్లేవ్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా 2024, జూలై 1 నుంచి చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. లయన్స్‌క్లబ్ సేవలను రానున్న రోజుల్లో మరింత విస్తృతం చేస్తామని జోన్ చైర్మన్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్, శేఖర్‌గౌడ్, వెంకటేష్, మహేందర్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నర్సింగ్ తదితరులు

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

గచ్చిబౌలి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలు అందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని శేరిలింగంపల్లి బీసీ ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు నర్సింగ్ ముదిరాజ్, బేరి రామచంద్రయాదవ్, బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు ఆర్కే సాయన్న డిమాండ్ చేశారు. గురువారం శేరిలింగంపల్లి తహసీల్దార్ కు వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేదలైన అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసి న వారిలో శ్రీనివాస్ యాదవ్, గోపాల్ ముదిరాజ్, బాబు, యాదగిరి, కృష్ణముదిరాజ్, సత్యనారాయణ యాదవ్, వి. శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మాదాపూర్, జూన్ 20(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరఢా ఝుళిపించారు. చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఏసీపీ రాజ్‌కుమార్ పర్యవేక్షణలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో గురువారం రెండు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా చందానగర్ ఉపకమిషనర్ వంశీకృష్ణ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టడం సరికాదని, ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినా, కొందరు నిర్మాణాలు చేసుకుంటూ వెళ్తున్నారని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందుందు అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటి అన్నింటిని కూల్చివేస్తాని అన్నారు.

పురుగుల మందుతాగి.. చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి


వీరబాబు (ఫైల్)

పేట్‌బషీరాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రామ్‌నారాయణ తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా, మోతేడు మండలం, పెద్ద చామలవల్లి గ్రామానికి చెందిని పిల్లి వీరబాబు కుటుంబ సభ్యులతో కలిసి నగరానికి వచ్చి పేట్‌బషీరాబాద్ సుగుణమ్మ కాలనీలో నివాసం ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అతడు ఇంటికి ఆలస్యంగా వస్తున్నాడు. ఉద్యోగానికి కూడా వెళ్లడం లేదు. దాంతో అతడికి అప్పులు పెరిగి మద్యానికి బానిసయ్యాడు. ఈ విధంగా ఎందుకు చేస్తున్నావని భార్య అడగగా, మరో మహిళతో సంబంధం పెట్టుకున్నాను అని చెప్పాడు. దాంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ నెల 15న భార్య పుట్టింటికి వెళ్లింది. మనస్తాపం చెందిన వీరబాబు ఈ నెల18న ఇంట్లో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు భార్యకు సమాచారం ఇచ్చి, సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

పేట్‌బషీరాబాద్, జూన్ 20(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం అయ్యారు. హాస్టల్ ఉంటున్న బాలిక, ఇంట్లో నుంచి వెళ్లిపోయిన భార్య, ఇలా ఇద్దరు ఒకే రోజు అదృశ్యం అయ్యారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడ కాప్రాకు చెందిన అనిత కుమార్తె కె.కల్పన(15) సుచిత్రాలోని ప్రైవేట్ హాస్టల్ ఉంటూ చదువుకుంటుంది. బుధవారం మధ్యాహ్నం సమయంలో గేటు వద్ద ఉన్న వాచ్‌మన్‌తో తనకోసం ఎవరో వచ్చారని బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తల్లిదండ్రులు, వసతి గృహం నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిద్రలేచే సరికి కనిపించని భార్య...

ఉమామహేశ్వరి కాలనీకి చెందిన మౌనిక(22) ఈ నెల 18న భర్త రాజుతో కలిసి పుట్టింటికి వచ్చింది. కుటుంబ సభ్యులు అందరూ భోజనం చేసి నిద్రపోయారు. తెల్లారి చూసేసరికి మౌనిక కనిపించలేదు. చుట్టు పక్కల, తెలిసిన ఇళ్లల్లో వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. పేట్‌బషీరాబాద్ పోలీసులకు కుంటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చిన్న వయస్సులోనే పిల్లల్లో నులిపురుగులను నివారించాలి

పేట్‌బషీరాబాద్, జూన్ 20(ఆంధ్రజ్యోతి): చిన్నవయస్సులోనే పిల్లల్లో నులి పురుగులను నివారించాలని, అప్పుడే వారిలో వ్యాధి నిరోధకశక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని డాక్టర్ నిఖిలి అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా రంగారెడ్డినగర్ డివిజన్‌లోని బస్తీ దవాఖానలో చిన్నారులకు ఆమె అల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంవత్సరం వయస్సు నుంచి 19 ఏళ్ల వయస్సు వరకు ఉన్న పిల్లలు అల్బెండజోల్ మాత్రలు తప్పని సరిగా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రమా, ఆశావర్కర్లు, స్థానిక నాయకులు, బాలరాజు, వేణు, సుధాకర్, రమేష్, దుర్గాప్రసాద్, గోపాల్ పాల్గొన్నారు.


చిన్నారికి అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డాక్టర్ నిఖిలి

భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి

● కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల బారినపడకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భోజనం చేసే ముందు విద్యార్థులు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ్‌చంద్ర, హెచ్ఎం రాధపద్మజ, ఉపాధ్యాయులు, శానిటేషన్ ఇన్‌చార్జి మనోహర్‌రెడ్డి, వైద్యసిబ్బంది ప్రియాంక, సుజీలీల, జ్యోతి, శశిరేఖ, సంతోషి, రాజ్యలక్ష్మి, అశాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా అల్బెండజోల్ మాత్రలు వేయాలి

● కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ మక్తా మహబూబ్‌పేటలోని ప్రభుత్వ పాఠశాలలో నులిపురుగుల నిర్మూలన మందులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీమెంబర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు నులిపురుగుల నివారణ మందులు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నులి పురుగులు పిల్లల ఆరోగ్యం, వారి ఎదుగుదల మీద కూడా తీవ్రంగా ప్రభావం చూపిస్తాయని తెలిపారు. 1-19 ఏళ్ల పిల్లలకు తల్లిదండ్రులు క్రమం తప్పకుండా అల్బండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు హరిత, రాజు, ఎఎన్ఎం స్వప్న, ఆశావర్కర్లు జంగం సుజాత, మానసవీణ, ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్స్ రజిత, శానిటేషన్ ఎస్ఎఫ్ఏలు మహేష్, ఆగమయ్య, స్థానిక నాయకులు నర్సింగ్‌రావు, మల్లేష్ పాల్గొన్నారు.

తల్లితండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి

● కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్, జూన్ 20(ఆంధ్రజ్యోతి): పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే తల్లితండ్రులు జాగ్రత్తలు తీసుకుని ఆరు నెలల కొకసారి అల్బెండజోల్ మాత్రలను పిల్లలకు వేయాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి సూచించారు.

గురువారం బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మందడి సుధాకర్‌రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. మమత, డా. రాజలక్ష్మి, కమ్యూనిటీహెల్త్ ఆఫీసర్ మన్మథమ్మ, పీహెచ్ఎన్ రాములమ్మ, ఏఎన్ఎం రోహిణి, ఇందిరా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు: ట్రాఫిక్ పోలీసులు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీలోని తహసీల్దార్ కార్యాలయం, జేఎన్‌టీయూ రోడ్లతో పాటు రైతుబజార్ మార్గంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే ఊరుకునే ప్రసక్తేలేదని కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. గత నెలలో రోడ్లపై ఏర్పాటు చేసిన పూలు, పండ్లదుకాణాలు తొలగించారు. గురువారం మళ్లీ వ్యాపారులు ఏర్పాటు చేయడంతో లా అండ్ ఆర్డర్ పోలీసుల సహకారంతో జీహెచ్ఎంసీ సిబ్బందితో దుకాణాల వద్ద రోడ్లపై ఏర్పాటు చేసిన సామగ్రిని తొలగించారు. రోజు రోజుకూ పెరుతున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని జీహెచ్ఎంసీ అధికారులు సీరియస్‌గా తీసుకొన్నారు.


నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

కమ్మసంఘం ఆధ్వర్యంలో రామోజీరావుకు నివాళి

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఈనాడు సంస్థల అధినేత చెరుకుపల్లి రామోజీరావుకు నివాళులర్పించారు. గురువారం వసంతనగర్‌లోని కేఎస్ఎస్ (కాకతీయ సేవా సమితి) కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, యర్రా నాగేశ్వరరావు, గణేషుని అజయ్‌కుమార్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతికారంగం, సినీరంగానికి, తెలుగు భాషాభివృద్ధికి రామోజీరావు చేసిన కృషిని వారు కొనియాడారు.

మత్తులో ఉన్న ఇద్దరి అరెస్ట్

వారి నుంచి సిరంజీలు, మత్తు మాత్రలు స్వాధీనం

బంజారాహిల్స్, జూన్ 20(ఆంధ్రజ్యోతి): మత్తుకు బానిసలుగా మారారు. ఊరిలో చేస్తున్న ఉద్యోగంతో వస్తున్న డబ్బు సరిపోకపోవడంతో నగరానికి వలస వచ్చి నాలుగు రోజుల నుంచి కేబీఆర్ పార్కు వాక్ వేలో బండరాయి కింద తలదాచుకున్నారు. అక్కడ మత్తులో ఉన్న వారిని ఇంటర్ సెప్టార్ పోలీసులకు అదుపులోకి తీసుకొనానరు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... త్రిపురకు చెందిన బుబాక్ సింగ్(23), మణిపూర్‌కు చెందిన వికాస్(25) నగరానికి వచ్చి ఫిలిం నగర్‌లో ఓ కంపెనీలో సెక్యూరిటీ గార్డులుగా చేరారు. చెడు అలవాట్ల కారణంగా కంపెనీ నిర్వాహకులు వారిద్దరిని ఉద్యోగం తొలగించారు. దీంతో ఇద్దరు జూబ్లీహిల్స్ రోడ్ 45 వైపు పార్క్ బండ కింద నాలుగు రోజులుగా తలదాచుకున్నారు. అన్నపానీయాలు లేకుండా అక్కడే పడుకుంటున్నారు. గురువారం సాయంత్రం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ శ్రీనాథ్, దినేష్ వీరిని గమనించారు. మత్తులో ఉండి, నడవడానికి వీలులేకుండా ఉండడంతో అక్కడ వెతికాగా కొన్ని ఇంజెక్షన్లు, సిరంజీలు, తెల్లటి పొడి, మత్తు మాత్రలు కనిపించాయి. చేతులపై ఇంజెక్షన్‌లు తీసుకున్నట్టు ఆనవాలు కనిపించాయి. దీంతో వారిని అదుపులోకి తీసుకుని బంజారాహిల్స్ శాంతి భద్రతల పోలీసులకు అప్పగించారు. మత్తు కలిగించే మాత్రలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసినట్టు తేలింది. అంతేకాకుండా ఓ వ్యక్తి రోజూ వచ్చి సిరంజీ. కొన్ని కవర్‌లు ఇచ్చేవాడని తెలిసింది. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మల్ సాధన జ్యోతి మందిర్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిబిరం


యోగా చేస్తున్న ఔత్సాహికులు

హైదరాబాద్ సిటీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ సాధన జ్యోతిమందిర్ యోగాసాధన కేంద్రం ఆధ్వర్యంలో 'యోగా సింపుల్ అండ్ ఎఫెక్టివ్' పేరుతో ఉచిత యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూసాపేట అంజనేయనగర్‌లోని సీతారామ కల్యాణమందిరంలో ఈనెల 20 నుంచి 23 వరకు నాలుగు రోజులపాటు యోగ ఉచిత శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న వారు 99495 08780 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

తలసాని శంకర్‌యాదవ్‌కు ప్రముఖుల నివాళి


శంకర్‌యాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్, హరీష్‌రావు, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు


శంకర్‌యాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు

రెజిమెంటల్‌బజార్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ అధ్యక్షులు శంకర్ యాదవ్ దశదిన కర్మకు పలువురు ప్రముఖులు హాజరై నివాళ్లు అర్పించారు. గురువారం సికింద్రాబాద్ ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో శంకర్ యాదవ్ దశదిన కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, లక్ష్మణ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, మహమూద్ అలీ, మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, జోగు రామన్న, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాలేరు వెంకటేష్, సుధీర్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, మాగంటి గోపీనాథ్, బండారి లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్‌రావు, బల్మూరి వెంకట్, సురభి వాణిదేవి, మధుసూదనాచారి, ఎగ్గే మల్లేశం, బండ ప్రకాశ్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్‌లు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు బోయిన్‌పల్లి, మోండా మార్కెట్‌లకు చెందిన వర్తకులు, హమాలీ కార్మికులు తదితరులు శంకర్ యాదవ్ చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు.


సిల్వర్ ఓక్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవంలో డీజీపీ రవిగుప్తా తదితరులు

సమాజ సేవకు పోలీస్ శాఖలో చేరాలి: డీజీపీ

హైదరాబాద్ సిటీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు వారి మానసిక ఎదుగుదలను ప్రోత్సహించే సంపూర్ణ విద్య అందించాల్సిన అవసరముందని తెలంగాణ డీజీపీ రవి గుప్తా అన్నారు. బౌరంపేటలోని సిల్వర్ ఓక్ ఇంటర్నేషల్ స్కూల్, ఓక్విండ్స్ క్యాంపస్‌లో గురువారం నిర్వహించిన ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సందేశమిచ్చారు. ఈ సందర్భంగా 60 అడుగుల స్తంభంపై జాతీయ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సిలబస్‌తోపాటు ఇతర అంశాలపై కూడా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. విద్యార్థులు సమాజసేవ చేసేందుకు పోలీస్‌శాఖలో చేరాలని ప్రోత్సహించారు. అంకితభావం, సమగ్రతతో దేశానికి సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ ధనుంజయ, అధ్యాపకులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ చదువుకోవాలి: కొలన్ హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్, జూన్ 20(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చదువుకోవాలని అప్పుడే పేదల బతుకులు బాగుపడతాయని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి సూచించారు. నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలోని జిల్లా పరిష్యత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమానికి విచ్చేసిన హన్మంత్‌రెడ్డి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుధాకర్, కాంగ్రెస్ నాయకుడు రాజశేఖర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం: ఎమ్మెల్యే గాంధీ


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

వివేకానందనగర్‌కాలనీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్(సీఎంఆర్ఎఫ్) పేదలకు వరమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన 15 మందికి వైద్య ఖర్చుల నిమిత్తం విడుదలైనరూ.3.96లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సప్తగిరికాలనీలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కల పెద్దబాస్కర్‌రావు, కాశీనాథ్‌యాదవ్, రాంచందర్, అంకారావు, స్వప్న పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే వివేకానంద్


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

పేట్‌బషీరాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధిని కొనసాగిస్తూ, రానున్న రోజుల్లో కుత్బుల్లాపూర్‌లో నిలిచిపోయిన పనులను పూర్తి చేసి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గురువారం దండమూడి ఎన్‌క్లేవ్ వద్ద ఎమ్మెల్యేను కలిసి వేంకటేశ్వర వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు పనులను చేయించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మనోహర్, కోశాధికారి జ్ఞానేశ్వర్‌గౌడ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'నాలాలు, కల్వర్టుల సమస్యలను పరిష్కరించాలి'

గచ్చిబౌలి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించాలని నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ కోరారు. గురువారం ఉపకమిషనర్, సంబంధితశాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలాలు, కల్వర్టులు, చెరువులలో వ్యర్థాలను తొలగించి వరద ముంపునకు గురికాకుండా కాలనీలు, బస్తీలను కాపాడాలని అధికారులను కోరారు. అంజయ్యనగర్, సిద్దిక్‌నగర్ బస్తీలోల ప్రభుత్వ భూముల్లో వెలుస్తున్న అక్రమ కట్టడాలను అరికట్టాలని, బొటానికల్ గార్డెన్ నుంచి మసీద్‌బండ సర్కిల్ వరకు రోడ్డు విస్తర్ణ పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్లపై షెడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలు చేసి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లేష్, ఆంజనేయులు సాగర్, చందు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.